క్లుప్తంగా

సీతారాములకు ప్రత్యేకపూజలు



ప్రత్యేక అలంకారంలో సీతారామలక్ష్మణులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక కోటా వీధిలోని సీతారామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం వసంత రాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మణుల ఉత్సవ మూర్తులకు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం,స్నాపన తిరుమంజన సేవ నిర్వహించి స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరింపజేసి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మహామంగ హారతులు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఊంజల సేవను నిర్వహించారు.

సర్వ నరసింహుడికి రూ.1.47 లక్షల ఆదాయం

శిరివెళ్ల: నల్లమల అటవీ ప్రాంతంలోని సర్వ నరసింహస్వామికి రూ.1.47 లక్షల ఆదాయం సమకూరింది. భక్తులు 90 రోజులుగా హుండీలో స్వామికి సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. రూ.1.47 లక్షల ఆదాయం సమకూరినట్లు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖరెడ్డి, ఈఓ నరసయ్య, చైర్మన్ రేవనూరు రామాంజనేయరెడ్డి తెలిపారు. కార్యక్రమంల మహదేవపురం సర్పంచు పెద్ది రమణయ్య, ధర్మకర్తలు నాగిరెడ్డి, విజయమ్మ, పూజారులు పాల్గొన్నారు.

నారాయణాచార్యులకు నివాళి



నారాయణాచార్యుల చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో మంగళవారం ప్రముఖ కవి పుట్టపర్తి నారాయణాచార్యుల జయంతిని నిర్వహించారు. శాస్త్రవేత్తలు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొని నారాయణాచార్యుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నారాయణాచార్యులు గొప్ప కవి, సాహితీ వేత్త, సంగీత విద్వాంసులు, రచయిత, వక్తగా ప్రశంసలు పొందారన్నారు. ఆయన రాసిన శివతాండవం, పండరీ భాగవతం, జనప్రియ రామాయణం, మేఘధూత, తదితర రచనలు ఆయనకు ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు తెచ్చాయన్నారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నారాయణాచార్యులను డాక్టరేట్ బిరుదులతో సత్కరించిందన్నారు.

చిరుధాన్యాల ఉపయోగాలపై అవగాహన

శిరివెళ్ల: చిరుధాన్యాల ఉపయోగాలపై మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ దస్తగిరమ్మ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జొన్నలు, రాగులు, సజ్జలు వాడకంతో విద్యార్థులకు తగిన పోషకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయకుమార్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పోలవరం పూర్తి చేయాలి



దీక్షలను ప్రారంభిస్తున్న రంగనాయుడు

నంద్యాల(అర్బన్): పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా, పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి, సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలని కోరుతూ స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. దీక్షలకు సంఘీభావం తెలిపిన అనంతరం రంగనాయుడు మాట్లాడారు. సంఘీభావం తెలిపిన వారిలో నాయకులు బాబాఫక్రుద్దీన్, ప్రసాద్, ఖాదర్‌బాషా, శ్రీనివాసులు, సంజీవులు, శివబాలకృష్ణ తదితరులు ఉన్నారు.

స్కిల్‌హబ్ కోర్సులు ప్రారంభం

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా స్కిల్ హబ్ కోర్సులు ప్రారంభమవుతున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. అసిస్టెంట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ బ్యూటీషియన్, థెరపిస్ట్, ఐటీ సేల్స్ టెలీకాలర్-వాయిస్, నాన్ వాయిస్ కోర్సులు ప్రారంభమయ్యాయన్నారు. ఆసక్తిగల ఇంటర్, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

రబీ ముగిసె.. రైతు మురిసె

- 1.091 లక్షల ఎకరాల్లో సాగైన పంటలు
- అత్యధికంగా శనగ సాగు
- ముగిసిన ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదు
- ఆర్‌బీకేల్లో జాబితా ప్రదర్శన, గ్రామ సభల నిర్వహణ పూర్తి
- 98 శాతం ఈ-క్రాప్ నమోదు

రబీ సీజన్ ముగిసింది. కళకళలాడుతున్న పైర్లను చూసి రైతు మురిసిపోతున్నాడు. అంతా అనుకున్నట్లు జరిగితే మరికొద్ది రోజుల్లోనే పంట దిగుబడులు చేతికిరానున్నాయి. ఈ ఏడాది రబీలో నియోజకవర్గ వ్యాప్తగా 1,09,155.49 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. జగనన్న ప్రభుత్వం ముందుచూపుతో 98 శాతం పంటలను వ్యవసాయ సిబ్బంది చేత ఈ-క్రాప్ నమోదు, ఈకేవైసీ ప్రక్రియలూ పూర్తి చేయించింది. ఒకవేళ ప్రకృతి అనుకూలించక పంట నష్టం జరిగితే ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకుంటుందన్న ధీమా రైతుల్లో నెలకొంది. – ఆళ్లగడ్డ





అలమూరులో పసుపు పంటకు, జమ్మలదిన్నెలో మొక్కజొన్నకు ఈ-క్రాప్ నమోదు చేస్తున్న విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్

మండలాల వారీగా పంటల నమోదు వివరాలు..

మండలం	నమోదైన పంటలు(ఎకరాల్లో)
ఆళ్లగడ్డ	20,669.77
ఉయ్యాలవాడ	31,850.26
చాగలమర్రి	12,233.88
దొర్నిపాడు	15,422.84
రుద్రవరం	17,038.11
శిరివెళ్ల	11,940.63

నియోజకవర్గంలో అత్యధికంగా శనగ, వరి, మినుము పంటలు సాగయ్యాయి. శనగ 41,744 ఎకరాలు, వరి 19,494, మినుము 14,775, మొక్కజొన్న 10916, జొన్న 8,000, ఉద్యాన పంటలు 10 వేల ఎకరాల్లో సాగు అయ్యాయి.

పక్కాగా ఈ-క్రాప్ నమోదు

ప్రభుత్వం ఈ-క్రాప్ నమోదు పక్కాగా చేపట్టారు. సంబంధిత అధికారులు రైతులతో కలిసి పొలం వద్దకు వెళ్లి రైతు ఏ పంట వేశాడు, ఎంత విస్తీర్ణంలో సాగు చేశాడు, కౌలుకు ఇచ్చాడా, సొంతంగా సాగు చేశాడా తదితర వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అలాగే పంటల నమోదు జాబితాను ఆర్బీకేల్లో ప్రదర్శించి అందులో ఏమైనా పొరపాట్లు ఉంటే సరిచేసుకునే అవకాశం కల్పించారు. అనంతరం సమాచారం అంతా ఈ-కర్షక్ యాప్‌లో నమోదు చేశారు.

ఈ-క్రాప్ ప్రయోజనాలు

పంట నమోదు వల్ల వరదలు, తుపాన్ల సమయంలో పంటలకు ఏదైనా నష్టం జరిగితే ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుంది. సున్నా వడ్డీతో పంట రుణాలు కావాలన్నా, పంటల బీమా కావాలన్నా, రాయితీపై పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు తీసుకోవాలన్నా ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి. పండించిన పంటల ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నా ఈ-క్రాప్ చేసి ఉండాలి.

ఎంతో ఉపయోగకరం



రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఈ- క్రాప్ నమోదు ను పకడ్బందీగా అమలు చేస్తోంది. వర్షాలు, కరువు కారణాలతో పంట నష్టపోయినా బీమా కింద పరిహారం అందుతుంది. నాకు ఇప్పటికి రెండు సార్లు పంట నష్టం కింద నగదు జమ అయింది. ఈ ఏడాది నేను 6 ఎకరాల్లో మొక్కజొన్న, వరి పంటలు సాగు చేశాను.వాటిని ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకున్నా. -రామకృష్ణ, రైతు,కోటకందుకూరు,ఆళ్లగడ్డ మండలం

గతంలో దళారులు చెప్పిందే ధర



నేను సొంత పొలంతో పాటు కౌలుకు కలిపి సుమారు 40 ఎకరాలు సాగు చేశాను. గతంలో పండించిన పంటలు ఎక్కడ అమ్మాలో తెలియక దళారులు చెప్పిన ధరకే విక్రయించాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ క్రాప్ చేయించుకున్న వారి ఉత్పత్తులు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుండటంతో మూడేళ్ల నుంచి మంచి ధర పలుకుతోంది. ఈ ఏడాది కూడా 30 ఎకరాల్లో సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేయించుకున్నా – మహేష్, రైతు, క్రిష్టిపాడు, దొర్నిపాడు మండలం

బీమా సొమ్ము అందింది



నేను ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.5 ఎకరాల్లో జొన్న పంట సాగు చేయడం జరిగింది. పంట బాగా పెరుగుతున్న సమయంలో ఈదురు గాలలు రావడంతో పంట పూర్తిగా దెబ్బతింది. అయితే ప్రభుత్వం ఇన్‌పుట్‌సబ్సిడీ కింద రూ.11,016 నా ఖాతాలో జమ చేసింది. పంటల సాగుకు ముందస్తుగానే పెట్టుబడి ని అందించడంతో పాటు నష్టపోతే పరిహారం అందించ డం ఎంతో మేలు. ఇప్పుడు కూడా రబీ పంటలు నమోదు చేయించాను. -నరసింహారెడ్డి,రైతు,మద్దూరు,చాగలమర్రి మండలం

పారదర్శకంగా ఈ-క్రాప్



ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వం నుంచి రైతులకు రావాల్సిన పరిహారాలు వస్తాయి. ఏదైనా నష్టం జరిగినప్పుడు బాధపడేకంటే ముందుగానే పంటలు నమోదు చేసుకోవడం మంచిది. నియోజకవర్గంలో ఈ-క్రాప్ నమోదు అత్యంత ప్రతిష్టాత్మకంగా, పారదర్శంగా పూర్తి చేశాం. -రామ్మోహన్‌రెడ్డి, ఏడీఏ, ఆళ్లగడ్డ

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విజయశేఖర్‌రెడ్డి



నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విజయశేఖర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో వైస్ ప్రెసిడెంట్‌గా అరిగెల రఘుప్రకాష్, జనరల్ సెక్రటరీ డి.ప్రతాపరెడ్డి, జాయింట్ సెక్రటరీ మద్దిలేటి, ట్రెజరర్ సయ్యద్ నూర్ ఆలంఖాద్రి, లైబ్రేరియన్ సెక్రటరీ నందం బాబురావు, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రటరీ ప్రసాదరెడ్డి, లేడీ రెప్రజెంటేటివ్‌గా రాజేశ్వరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల కమిటీ సభ్యులు రామకృష్ణయ్య, రాజేశ్వరరెడ్డి, సుదాంశమౌలిరెడ్డి, షన్నులు తెలిపారు. నూతన సభ్యులను సహ న్యాయవాదులు ఘనంగా సత్కరించాయి. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు, రామచంద్రారావు, రామచంద్రారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, వివేకానందరెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): కార్మికులకు కనీస వేతనాలు అమలు, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ వచ్చే నెల 5న సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోట మద్దులు కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, గౌస్, వెంకటలింగం, జైలాన్, మధు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాద పద్మారాధన సేవ



అష్టాదళ పాద పద్మారాధన సేవలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లోని కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి చీర, ఒడి బియ్యం సమర్పించి మహా మంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్, నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌ను పునరుద్ధరించండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: పట్టణ సమీపంలోని చిన్న చెరువు కట్టపై ఉన్న పర్యాటక రెస్టారెంట్‌ను పునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం చిన్న చెరువు ప్రాంతాన్ని అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సాయంత్రం వేళల్లో గడిపేందుకు చిన్న చెరువు కట్టపై రెస్టారెంట్‌ను పునరుద్ధరించి ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పాలని టూరిజం అధికారి సత్యనారాయణకు సూచించారు. సుంకులమ్మ ఆలయం నుంచి చిన్న చెరువు కట్ట మీదుగా రెస్టారెంట్ వరకు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలన్నారు.

క్రైం కార్నర్

బాలిక అదృశ్యం

ఆళ్లగడ్డ: పట్టణానికి చెందిన 17 ఏళ్ల కుమ్మరి భార్గవి అదృశ్యమైనట్లు ఎస్ఐ తిమ్మయ్య మంగళవారం తెలిపారు. కొత్త మసీదు వీధికి చెందిన ఆంజనేయులు కూతురు భార్గవి సోమవారం ఇంట్లో నుంచి బజారుకు వెళ్తున్నట్లు చెప్పింది. ఎంతకూ తిరిగి రాకపోవడంతో తెలిసిన వారిని, బంధువులను విచారించగా ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీంతో బాలిక తండ్రి పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కారు డ్రైవర్‌కు స్వల్పగాయాలు

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల గ్రామంలో మంగళవారం కారు, ట్రాలీ ఆటో ఢీ కొన్నాయి. నంద్యాల నుంచి కోవెలకుంట్ల వైపుగా వెళ్తున్న కారు, కోవెలకుంట్ల నుంచి నంద్యాల వైపు వెళ్తున్న ఆటో ప్రమాదవశాత్తూ ఢీకొనడంతో కారు డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. కారుమాత్రం పూర్తిగా దెబ్బతింది.

దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బొమ్మలసత్రం: విద్యార్థులు చిన్నతనం నుంచే దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రసాదరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత సూచించారు. నంద్యాలలోని నూనెపల్లి మున్సిపల్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ట్రాక్టర్ రివర్స్ డ్రైవింగ్ పోటీలు

కొలిమిగుండ్ల: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కనకాద్రిపల్లెలో ఈనెల 30న ట్రాక్టర్ రివర్స్ డ్రైవింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీల్లో పాల్గొనే ట్రాక్టర్ డ్రైవర్లు బుధవారం టోకెన్‌లు తీసుకోవాల్సి ఉంది. విజేతలకు నంద్యాలకు చెందిన శ్రీనంది ఆటోమోటివ్స్, అనంతపురం జిల్లాకు చెందిన వినాయక మోటార్స్‌కు చెందిన మహీంద్రా ట్రాక్టర్స్ తరపున బహుమతులు అందజేయనున్నారు.

జోడెడ్లలా అభివృద్ధి, సంక్షేమం



పేరాయిపల్లె-కొండాపురం బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ గంగుల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి



శిరివెళ్ల: యర్రగుంట్లలో సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న గంగుల ప్రభాకరరెడ్డి, బిజేంద్రారెడ్డి



ఉయ్యాలవాడ: సుద్దమల్ల సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి

- నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెలే బిజేంద్రారెడ్డి
- గ్రామాల్లో పండుగ వాతావరణం

ఆళ్లగడ్డ: జోడెద్దుల బండిలా అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమప్రాధాన్యమిస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని ప్రభుత్వ విప్ గంగుల ప్రభాకర్‌రెడ్డి,ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిలు కొనియాడారు. నియోజకవర్గంలోని ఆళ్లగడ్డ, శిరివెళ్ల, దొర్నిపాడు మండలాల పరిధిలో పూర్తయిన పలు అభివృద్ధి పనులను మంగళవారం వారు అట్టహాసంగా ప్రారంభించారు. దశాబ్దాలుగా గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యంలేక, గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మాణం చేపట్టకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతూ నెట్టుకొస్తున్న ప్రజలు ఈ ప్రభుత్వంలో వాటిని నిర్మిస్తుంటే హర్షం వ్యక్తం చేస్తున్నారు. మారుమూల గ్రామాల్లో కోట్లాది రూపాయలతో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించి వాటిని జాతికి అంకితం ఇవ్వడం ఆ గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఇప్పటికే ఇచ్చిన హామీలపై ప్రత్యేక దృష్టిపెట్టి సింహభాగం నెరవేర్చామని చెప్పారు. కార్యక్రమాల్లో ఎంపీపీలు గజ్జల రాఘవేంద్రారెడ్డి,నాయక్ వసీం,అమర్‌నాథరెడ్డి, బుడ్డా భాగ్యమ్మ, జెడ్పీటీసీలు పున్యలక్ష్మీదేవి, శకుంతల, లక్ష్మీదేవి, సర్పంచులు రామద్దిలేటిరెడ్డి, అస్సానమ్మ, సాయిరెడ్డి, ప్రసాద్, శివరామిరెడ్డి, అంబటి నాగలక్ష్మమ్మ, అవుకు చెంచమ్మ, సుభాన్, లక్ష్మీదేవి, మహేశ్వరి, జానకమ్మ, నాయకులు రవిరెడ్డి, మోహన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి,ఓబుల్‌రెడ్డి, నాగమద్దిలేటిరెడ్డి, మహమ్మద్‌హుస్సేన్, బచ్చు ప్రతాప్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బత్తుల నాగేశ్వర్‌రావు, భూమా చెంచిరెడ్డి, పంచాయ తీ రాజ్, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభించిన పనులు

- ఆళ్లగడ్డ మండలంలో ఓబులంపల్లెలో రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ 21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం
- రూ.95 లక్షలతో నిర్మించిన పేరాయిపల్లె మెట్ట(నంద్యాల హైవే) నుంచి కోవెల కుంట రోడ్డు (కొండాపురం)వరకు నిర్మించిన బీటీ రోడ్డు
- బత్తలూరులో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం

శిరివెళ్ల మండలం..

- యర్రగుంట్ల గ్రామలో రూ.12 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు
- జీనేపల్లె గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు
- గాంధీనగరంలో రూ.68 లక్షలతో నిర్మించిన బీటీ, సీసీ రోడ్లు

దొర్నిపాడు మండలం..

- బుర్రారెడ్డిపల్లెలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం
- క్రిష్టిపాడులో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకే

ఉయ్యాలవాడ మండలం..

- సుద్దమల్లలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం
- ఆర్ జంబులదిన్నెలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం
- మాయలూరులో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం

'తీర్మానం రాజ్యాంగ విరుద్ధం'

నంద్యాల(అర్బన్): బోయ వాల్మీకులను రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ జాబితాలో చేర్చుతూ శాసన సభలో తీర్మానం చేయడం రాజ్యాంగ విరుద్ధమని, దాన్ని వ్యతిరేకిస్తూ వచ్చే నెల 1న నంద్యాలలో భారీ ర్యాలీ నిర్వహించనున్నామని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందిన బోయలను ఎస్టీ జాబితాలో చేరిస్తే గిరిజనుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గిరిజనులు ఏకతాటిపైకి వచ్చి ఉద్యమించాల్సిన అవసరముందన్నారు. సమావేశంలో నాయకులు విజయ్‌నాయక్, ఉషారాణి, రవీంద్రనాయక్, రామచంద్రనాయక్, వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సీతారాముల ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠ



ఉత్సవ విగ్రహాలకు జల ప్రతిష్ఠ చేస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: మండల కేంద్రం చాగలమర్రిలో వెలసిన కోదండ రామాలయంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలకు జల ప్రతిష్ఠ మహోత్సవం భక్తి శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లతో పాటు హనుమంతుడి నూతన ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠంపజేసేందుకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం గణపతి పూజా, పున్యవాచాకం, పంచాంగవ్యప్రాసణ, రక్షాబంధనం, బ్రాహ్మణ గృతిక్‌వరణం, మండప ఆరాధన, అభిషేక్ కార్యక్రమాలను నిర్వహించారు.

తక్షణ సాయం అందజేత

నంద్యాల(అర్బన్): పట్టణంలోని 42వ వార్డుకు చెందిన రాయుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన భార్య ఓబులమ్మకు మంగళవారం స్థానిక సచివాలయ సిబ్బంది, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు కిరణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో తక్షణ సాయం కింద రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బాలరాజు, మద్దయ్య, రాజ్‌కుమార్, యాకూబ్, మద్దిలేటి, సురేష్ పాల్గొన్నారు.

31న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని ఈనెల 31 న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ. 25 వేలు, రూ. 15 వేలు, రూ. 8వేలు చొప్పున అందజేస్తామన్నారు. ఈపోటీలలో పాల్గొన దలచిన వారు 30వ తేదీ సాయంత్రంలోగా రూ. 500 ఎంట్రీఫీజు చెల్లించాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

నంద్యాల(రూరల్): అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామంలో ఎమ్మెల్యే శిల్పా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, అధికారులకు చెప్పి వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు శెట్టి ప్రభాకర్, మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, మాజీ చైర్మన్ పురుషోత్తమరెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, సర్పంచ్ దొలావతి, ఎంపీటీసీ బసవసుబ్బారెడ్డి, మండల కన్వీనర్ బసవేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న శిల్పా రవి, పీపీ నాగిరెడ్డి

గోస్పాడు: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి అన్నారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని మండలంలోని ఎస్.నాగులవరం గ్రామంలో ఏర్పాటు చేసిన అఖిల భారత బాల్ బ్యాడ్మింటన్ పోటీలను మంగళవారం వారు ప్రారంభించి మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఇలాంటి క్రీడాపోటీలు,సాంస్కృతికకార్యక్రమాలవల్ల గ్రామాల్లో ఐక్యత,ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుందన్నారు.